ఘనంగా పరశురామ జన్మోత్సవం



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సమితి కార్యాలయంలో పరశురామ జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పరశురాముడి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, కోశాధికారి మంత్రి సునిల్, దేవులపల్లి అశోక్ కుమార్, గూడ జయరాం, సర్వ రఘు, బ్రాహ్మణ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యావాదులు తెలుపుతూ ఓయూలో విస్తృత స్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ గాదె వెంకట్ అధ్యక్షత వహించగా విద్యా కమిషన్ సభ్యుడు డా.చారకొండ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో కేవలం 20 శాతం మంది చదవుకున్న నిరుద్యోగులే లబ్ధి పొందుతారని మిగితా 80 శాతం మంది ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు ప్రొ.మల్లేశం, డా.మేడి రమణ, డా.వెంకట్ గల్ల వెంకట్, ఓయూ విద్యార్థి నేత వలిగొండ నరసింహ, ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు కృపాకర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ డా.నంద్రు నర్సింహరావు మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు భైరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్రీడి ప్రింటింగ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ అడ్డిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సీపీడీడీఏఎం) సెంటర్ ఎక్స్‌లెన్స్‌లో త్రీడి ప్రింటింగ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థుల నుంచి వేసవిలో ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఇంటర్న్‌షిప్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, సీపీడీడీఏఎం డైరెక్టర్ ప్రొ.శివరామ కృష్ణతో కలిసి మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. త్రీడి ప్రింటింగ్ ఇంటర్న్‌షిప్‌కు అన్ని బ్రాంచ్‌లకు చెందిన బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు వారాల బేసిక్ కోర్సు, మూడు నెలల అడ్వాన్స్ కోర్సులో ప్రవేశాలకు వచ్చే నెల 7లోగా ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదే నెల 12నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఆర్థిక వ్యవస్థపై యువత అధ్యయనం చేయాలి

హిమాయత్‌నగర్: ఆర్థిక వ్యవస్థపై నేటి యువత అధ్యాయనం చేస్తూ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో నడిచేందుకు కృషి చేయాలని ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేష్‌రెడ్డి అన్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో 'ఆదాయ నిర్వహణ సమస్యలు-సవాళ్లు' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, పలు రకాలుగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఓబుల్‌రెడ్డి, అప్పారావు, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం మైలార్‌దేవ్ పల్లికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పృథ్వీరాజ్ (21) ఫలక్‌నుమా - శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమైనందున అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వృద్ధుడు (71) మృతదేహాన్ని కాచిగూడ రైల్వే ప్లాట్‌ఫారం-3పై పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలి

కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



కాచిగూడలో కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ కన్నె ఉమారాణి



అంధ్రకేఫ్ చౌరస్తాలో చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: జమ్ము కశ్మీర్ పహల్గాంలో దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రాత్రి పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళిగా డివిజన్‌లోని ఆంధ్రకేఫ్ చౌరస్తాలో బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ రక్షణకు చేపట్టిన చర్యలు చేపడుతున్నారని అన్నారు. 26మంది హిందూ పర్యాటకులను అతి కిరాతంగా హతమార్చిన దుశ్చర్యను పార్టీలకతీతంగా భారతీయులంతా ముక్తకంఠంతో ఖండించి దేశానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, సత్తిరెడ్డి, మహమూద్, అరుణ్‌కుమార్, దొనేటి సత్యం, ఆనంద్‌రావు, నీరజ్, సాయి, తరుణ్, సంపత్‌యాదవ్, చిన్న, సంధ్యారాణిస స్వప్న, సంయుక్త రాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిలో బలైన పర్యాటకులకు నివాళి

కాచిగూడ: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో బలైన పర్యాటకులకు నివాళులర్పిస్తూ మంగళవారం కాచిగూడలో బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. నింబోలిఅడ్డ మహంకాళి దేవాలయం నుంచి కాచిగూడ చౌరస్తాలోని వీర్‌సావర్కర్ విగ్రహం వరకు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీని కార్పొరేటర్ కన్నె ఉమారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌యాదవ్, ఆకాశ్, సుదర్శన్, దిలీప్, రాము, సురేష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



విద్యార్థులకు జ్యూట్ బ్యాగ్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

నల్లకుంట: విచ్చలవిడి పాలథీన్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని విద్యావేత్త, సెయింట్ మేరీ పాఠశాల కరస్పాండెంట్ వై.వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లకుంట లింగాలగడ్డ శివాలయం సమీపంలోని పాఠశాలలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన పాఠశాల కరస్పాండెంట్ వై.వెంకట్‌రెడ్డి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. మార్కెట్‌కు వెళ్లినప్పుడు విధిగా జ్యూట్ బ్యాగ్‌లను తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్యూట్ బ్యాగ్‌లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల నిర్వహించిన నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేకు హాజరు కాలేకపోయిన కొందరు విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.స్వరూప, ఉపాధ్యాయులు తబుసం, భారతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

శంకర భగత్పాదులకు విశేష పూజలు

నేడు శారదాంబకు మహాభిషేకం



నేడు శారదాంబకు మహాభిషేకం..

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శంకర జయంతి మహోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శక్తిగణపతి, చంద్రమౌళీశ్వర స్వామి, శారదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శంకర భగవత్పాదులకు విశేష పూజలు కావించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీశంకర విజయంపై ఇచ్చిన ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కావించారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని బుధవారం (నేడు) ఉదయం 7గంటలకు శ్రీశారదాంబకు మహాభిషేకం ఉంటుందని శంకరమఠం ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాసమూర్తి చెప్పారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం ప్రవచనాలు ఉంటాయని తెలిపారు.

అంగన్‌వాడీ, బస్తీ దవాఖానా సమస్యలను పరిష్కరించండి



అచ్చుత్‌రెడ్డి మార్గ్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: అచ్చుత్‌రెడ్డి గల్లీలో అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ సీనియర్ నేత సురేందర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. అనంతరం వడ్డెరబస్తీ అంగన్‌వాడీ సెంటర్, బస్తీ దవాఖానాను బీజేపీ నాయకులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచినీటి, విద్యుత్ తదితర సమస్యలను సాయికృష్ణయాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు నరేష్, కౌండిన్య ప్రసాద్, గౌరీశంకర్, శేషసాయి, ఓంప్రకాష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత ఓంకార్‌కు మాతృవియోగం



సహనంద భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ యూత్ కమిటీ అధ్యక్షుడు జె.ఓంకార్ తల్లి సహనంద(64) ముషీరాబాద్‌లోని తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, శ్రీధర్‌చారి, దీన్‌దయాల్‌రెడ్డి, సదా, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, లింగంగుప్తా తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఓంకార్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె అంత్యక్రియలు బాపూజీనగర్ శ్మశానవాటికలో జరిగాయి.

పిల్లలూ దేవుడు చల్లని వారే...

చిక్కడపల్లి: జీఎస్‌ఆర్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'పిల్లలూ దేవుడు చల్లని వారే..'శీర్షకతో నిర్వహించిన తెలుగు-హిందీ చిత్రాల సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గాయకులు పాటలను మధురంగా ఆలపించారు. అనంతరం ప్రముఖులకు నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, చింతలపూడి త్రినాథ రావు, దివ్య, కార్తీక, పద్మజ, అరుణ, రామమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పూజలో గుర్రం శంకర్, యాదమ్మ, మాధవి, అరుణ్, మధు

చిక్కడపల్లి: గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ సమీపంలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, సుజాత, మాధవి, లక్ష్మీబాయి, లావణ్య, శ్యామల, సుజాత, అరుణ్, మధు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు చల్లని పానీయాలు



అలీకేఫ్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు కూల్‌డ్రింక్స్ అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అంబర్‌పేట: ఎండలో నిలబడి విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి చల్లని పానీయాలను అందించారు. మంగళవారం గోల్నాక డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సురేష్‌గౌడ్ వ్యక్తిగతంగా ట్రాఫిక్ సిబ్బందికి మజ్జిగ, కూల్‌డ్రింక్స్, పండ్లను పంపిణీ చేశారు. బర్కత్‌పుర నుంచి అలీకేఫ్ వరకు విధుల్లో సిబ్బందికి పంపిణీ చేసినట్లు సురేష్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌కె.బాబు, రెడ్డపాక రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

హిమాయత్‌నగర్: తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్, కార్మిక హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కార్మికుల డిమాండ్స్‌తో కూడిన మే డే వాల్ పోస్టర్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్యతో కలిసి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కేసీఎస్ ప్రసాద్, ఇ.బాబు, కార్మిక హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు సురుగు ప్రభాకర్, టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి క్రిష్టాఫర్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ



ఎస్సై మహ్మద్ అబ్దుల్ గఫార్‌కు వీడ్కోలు పలుకుతున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

కాచిగూడ: కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ అబ్దుల్ గఫార్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు పోలీస్‌స్టేషన్ సిబ్బంది, అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు. ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు మహ్మద్ అబ్దుల్ గఫార్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

అంబేడ్కర్ త్యాగాలతోనే మనకు హక్కులు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అంబర్‌పేటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు

అంబర్‌పేట: నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో మనకు లభించిన హక్కుల వెనుక రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మేధస్సు, త్యాగం, దూరదృష్టి ఉన్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు ప్రజాస్వామ్య ఫలాలను అనుభవిస్తున్నామంటే ఆయన వల్లేనని అన్నారు. అందువల్ల నిత్యం అంబేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథన్, పీసీ విష్ణునాథ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నేతలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీపీసీసీఎఫ్ అధ్యక్షుడు సందిల బలరాం



సుందరయ్య విజ్ఞాన కేంద్ర: పది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం (టీపీసీసీఎఫ్) అధ్యక్షుడు సందిల బలరాం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏడాది నుంచి గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోయిన పంచాయతీ కార్యదర్శులు అన్ని తానై నడిపిస్తూ గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాపాలన దరఖాస్తులు వాటి ఆన్‌లైన్ ఎంట్రీ, మిషన్ భగీరథ సర్వే, సమగ్ర కులగణన సర్వే, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇంటింటి సర్వే, ఎల్‌ఆర్‌ఎస్ సర్వే, రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం వివిధ రకాల పని భారాలు మోస్తున్నామని అన్నారు. పంచాయతీలకు ఎటువంటి నిధులు రాకపోయిన గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తూ అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. తమ సొంత జేబుల నుంచి డబ్బులు పెట్టుకున్నామని పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోతే రోడ్డు మీద పడతామని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 10 నెలలుగా పెండింగ్ చెక్కులను క్లియర్ చేయాలని కోరారు.

వేడుకగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



వాసవీ చౌదరిని సన్మానించిన శ్రీనివాసశర్మ

నల్లకుంట: నృత్యం మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వంతో పాటు సామాజిక అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుందని విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ అన్నారు. నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని శ్రీసరస్వతి సంగీత విద్యాలయంలో మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాలి ఉషాగాయత్రి శిష్యురాలు ప్రముఖ నర్తకి వాసవీ చౌదరితో పాటు పలువురు నర్తకులను సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాసశర్మ శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏతో పాటు కూచిపూడిలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా పూర్తి చేసిన వాసవీ చౌదరి దూరదర్శన్ 'ఏ గ్రేడ్'కళాకారిణిగా గుర్తింపు పొందిన గొప్ప నృత్యకారిణి అని చెప్పారు. నృత్య కళను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, రాజకీయ, సాంస్కృతిక, జాతి అడ్డంకులు తొలగించి, నృత్యం ద్వారా ప్రజలను కలుపుకోవడానికి ఒక అంతర్జాతీయ వేదికగా ఈ వేడుక ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ నృత్య కమిటీ 1982లో ఈ అంతర్జాతీయ నృత్యోత్సవాన్ని ప్రారంభించిందన్నారు. ఆధునిక బ్యాలెట్ సృష్టికర్త జీన్-జార్జెస్ నోవెర్రె జయంతి రోజున ఈ వేడుక జరుపుకోవడం ఆనవాయితీ అని శ్రీనివాస శర్మ పేర్కొన్నారు.

యూనివర్సిటీల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా మహేష్



పీడీఎస్‌యూ యూనివర్సిటీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీ కోఆర్డినేషన్ కమిటీని పీడీఎస్‌యూ ప్రకటించింది. కన్వీనర్‌గా పి.మహేష్, కమిటీ సభ్యులుగా మంద నవీన్, ఎస్.కె.ఆసిఫ్, సంతోష్ (ఓయూ), అరిజ్జ(సెంట్రల్ యూనివర్సిటీ), మర్రి మహేష్, రాజేష్(కేయూ), సంజయ్(మహాత్మా గాంధీ యూనివర్సిటీ)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రతి యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని పీజీ విద్యార్థులకు రూ.10వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.15వేలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. ఓయూలో విడుదల చేసిన సర్క్యూలర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ జన సమితి ఆవిర్భావ వేడుకలు



రాంనగర్ గుండు వద్ద టీజేఎస్‌జెండాను ఆవిష్కరిస్తున్న గ్రేటర్ అధ్యక్షులు ఎం.నరసయ్య

ముషీరాబాద్: తెలంగాణ జన సమితి 7వ ఆవిర్భావ వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. అడిక్‌మెట్ డివిజన్ తెలంగాణ జన సమితి అధ్యక్షులు కె.సుధాకర్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడేళ్లలో పార్టీ ఎన్నో అద్భుత విజయాలను సాధించిందని తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేసిందన్నారు. నిరుద్యోగం, రైతాంగ సమస్యలపై ఆర్టీసీ సమస్యలపై, ఆదివాసీల సమస్యలపై పోరాడుతూనే ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం శ్రమించిందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, బీసీ జన సమితి అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, జైపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

కవాడిగూడ: తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు ఇందిరా పార్కు ధర్నాచౌక్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మహాధర్నా చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు పోతుల నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో టీజీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 27 డిపార్టుమెంట్లలో 13లక్షల ఉద్యోగ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

◆ మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయలేని విధంగా కేంద్రం ఆదేశాలిస్తోందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా భావావేశాలు రెచ్చగొట్టే పనులు మానుకోవాలని హితువు పలికారు.

◆ సీఐటీయూ నాయకులు వీఎస్ రావు మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సంక్షేమం కోసం పని చేయడం లేదన్నారు. కేవలం కాంట్రాక్టర్ల కోసమే పని చేస్తోందని విమర్శించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే గత ప్రభుత్వాన్ని దించేసినట్లే ఈ ప్రభుత్వాన్ని దించేసే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.



ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో నాయకులు ప్రభాకర్‌నాయర్, మచ్చా రంగయ్య, నాగేశ్వరరావు